
సాక్షి
రంగారెడ్డి
మంగళవారం : 3 : అక్టోబర్ : 2023



తెలంగాణ నంబర్ వన్

దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు చేపడుతున్నారని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. 8లో▸



బెల్ట్ షాపులపై దాడులు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై పోలీసులు దాడి చేసిన సంఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో జరిగింది. 8లో▸



న్యాయమూర్తుల శ్రమదానం

స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, న్యాయవాదులు శ్రమదానం చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

గవర్నర్‌ను కలిసిన 'గోలి'



ఆమనగల్లు: గవర్నర్ తమిళిసైని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు ఆనంద్, భారతి, భూక్యా జ్యోతి, కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం



గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టరేట్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం రూరల్: గాంధీజీ చూపిన మార్గం అనుసరణీయమని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్య్ర ఉద్యమంలో అహింస, సత్యాగ్రహంతో మహాత్మాగాంధీ ముఖ్యపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన అహింసా మార్గాన్ని ఐక్యరాజ్య సమితి గుర్తించి గాంధీ జయంతి రోజున ప్రపంచ అహింసా దినోత్సవంగా ప్రకటించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ ప్రమీల రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్ముడి బాటలో నడవాలి



మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మీర్‌పేట: ప్రతి ఒక్కరూ మహాత్మాగాంధీ బాటలో నడవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా సోమవారం మీర్‌పేటలోని చందన చెరువు కట్టపై గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సత్యం, అహింస సిద్ధాంతాలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, కీసర యాదిరెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, పద్మశ్రీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వందే భారత్ రైలులో '14 నిమిషాల అద్భుతం'

అడ్డగుట్ట: రైల్వే ప్రయాణికులకు పరిశుభ్రమైన టాప్‌క్లాస్ రైలు ప్రయాణ అనుభవాన్ని కల్పించేందుకు రైల్వే శాఖ కృషి చేస్తుందని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ అన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వందే భారత్ రైలులో '14 నిమిషాల అద్భుతం' కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం నూతన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామన్నారు. అందులో భాగంగానే రైల్వే మంత్రిత్వ శాఖ నేతృత్వంలో '14 నిమిషాల అద్భుతం' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వందే భారత్ రైలులో 16 కోచ్‌లకు గాను, ఒక్క బ్యాచ్‌లో ముగ్గురు క్లీనర్స్ చొప్పున 16 బ్యాచ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీరిని స్వచ్ఛ్ వందే వీర్స్ అని నామకరణం చేసినట్లు చెప్పారు. విశాఖపట్నం-సికింద్రాబాద్ వందే భారత్ రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తరువాత ప్రయాణికులు రైలు దిగిన వెంటనే ఈ 16 బ్యాచ్‌లు ఒక్కో కోచ్‌లోకి వెళ్లి పరిశుభ్రత పనులు ప్రారంభిస్తారన్నారు. పూర్తిగా 16 కోచ్‌లలో 16 బృందాలు 16 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో 14 నిమిషాల్లో వందే భారత్ రైలును పూర్తిగా శుభ్రపరుస్తారని వివరించారు. ఆ తర్వాతనే ప్రయాణికులను కోచ్ లోపలికి అనుమతిస్తారని చెప్పారు. ప్రయాణికులకు వరల్డ్ క్లాస్ సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని వందే భారత్ రైళ్లలో వంద శాతానికి తగ్గకుండా ప్రయాణికుల ఆక్యుపెన్సీ ఉంటుందన్నారు. అనంతరం, స్వచ్ఛ్ వందే వీర్‌లు చేస్తున్న పరిశుభ్రత పనులను పర్యవేక్షించారు.

ఆకలి తీర్చేలా.. హాజరు పెరిగేలా



రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

పేద విద్యార్థులకు దసరా కానుక

- సర్కారు బడుల్లో 'సీఎం కేసీఆర్ అల్పాహార పథకం'
- రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించే అవకాశం
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న సీఎం కేసీఆర్
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సబిత, జిల్లా అధికారులు
- జిల్లాలో 1.60 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం విజయదశమి కానుకను ముందే ప్రకటించింది. నిరుపేద విద్యార్థుల కోసం 'సీఎం అల్పాహార పథకాన్ని' అందుబాటులోకి తేబోతోంది. ఇప్పటికే తమిళనాడులో ఈ పథకం అమల్లో ఉంది. అక్కడి ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఉదయం పూట అల్పాహారం అందజేస్తున్నారు. తెలంగాణలో ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థికి అందజేయాలని నిర్ణయించారు. నిజానికి ఈ పథకాన్ని ఈ నెల 24 నుంచి అందుబాటులోకి తేవాలని భావించగా ఎన్నికల షెడ్యూల్ ముందే వెలువడే అవకాశం ఉండటం, కోడ్ వచ్చే అవకాశం ఉండటంతో ప్రారంభ తేదీని ముందుకు తెచ్చినట్లు సమాచారం. ఈ మేరకు జిల్లాలోని శివరాంపల్లి, బడంగ్‌పేట్, రావిర్యాల ప్రభుత్వ పాఠశాలల్లో ఏదో ఒక చోట పథకం ప్రారంభ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ముఖ్య అతిథిగా సీఎం కేసీఆర్ హాజరు కానున్నట్లు సమాచారం. ఈ క్రమంలో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సోమవారం రావిర్యాల ప్రభుత్వ స్కూలును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

రోజుకో మెనూ

జిల్లాలో 1,263 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,63,251 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో చాలా వరకు పేద, మధ్య తరగతికి చెందిన వారే. తరగతులు ఉదయం తొమ్మిది గంటలకే ప్రారంభం అవుతుండటం, ఇంట్లో వేళకు వంట కాకపోవడంతో విద్యార్థులు ఖాళీ కడుపుతో స్కూలుకు చేరుకుంటున్నారు. మధ్యాహ్నం వరకు ఏమీ తినకపోవడంతో ఆకలికి కడుపునొప్పి సహా గ్యాస్ట్రిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. చదువుపై ధ్యాస పెట్టలేక పోతున్నారు. శారీరక, మానసిక రుగ్మతల బారినపడుతూ.. స్కూలుకు గైర్హాజరవుతున్నారు. ఫలితంగా హాజరు శాతంపై ప్రభావం చూపుతోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు ఉదయం 8.30 నుంచి తొమ్మిది గంటల మధ్యలో పాఠశాలకు వచ్చిన ప్రతి విద్యార్థికి రోజుకో రకమైన అల్పాహారం (కిచిడి, ఇడ్లీ సాంబార్, ఉప్మా, బోండా) అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ పథకం ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతాన్ని మెరుగుపర్చడంతో పాటు పిల్లలను మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారు చేసేందుకు దోహదపడుతుందని భావిస్తున్నారు.

తల్లిదండ్రుల హర్షం


రాష్ట్రవ్యాప్తంగా 43,000 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నట్లు అంచనా. సీఎం అల్పాహార పథకంలో భాగంగా వీరికి రోజుకో వెరైటీ బ్రేక్‌ఫాస్ట్‌ను అందించడం ద్వారా ప్రభుత్వంపై ఏటా రూ.400 కోట్ల మేర భారం పడనుంది. ఇప్పటికే మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్న ప్రభుత్వం.. తాజాగా అల్పాహార పథకాన్ని అమల్లోకి తెస్తుండడంపై ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకం అమలుకు పెద్ద సమస్య లేకపోయినా మారుమూల ప్రాంత ప్రభుత్వ స్కూళ్లలో ఎంత వరకు సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. అల్పాహారం సరఫరా బాధ్యతను ఏదైనా స్వచ్ఛంద సంస్థకు అప్పజెబుతారా? లేక మధ్యాహ్న భోజనం కార్మికులకే అప్పగిస్తారా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సుశీందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలు, జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 13 వరకు అవకాశం ఉందన్నారు. వివరాలకు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.

అందాల చిలుక..దొరికిందలా

- పంజరం నుంచి ఎగిరిపోయిన ఆస్ట్రేలియా జాతి గాలా కాక్టో
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యజమాని
- చిలుకను పట్టించిన వాట్సాప్ స్టేటస్



దొరికిన ఆస్ట్రేలియా జాతి చిలుక

బంజారాహిల్స్: తాను ఎంతో ఇష్టంగా విదేశాల నుంచి తెచ్చుకొని పెంచుకుంటున్న అరుదైన చిలుక కనిపించకపోవడంతో యజమాని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఒక రోజు వ్యవధిలోనే ఆ చిలుకను గుర్తించి యజమానికి అప్పగించారు. ఎస్‌ఐ ఎంఎం రాకేష్ తెలిపిన వివరాల ప్రకారం..జూబ్లీహిల్స్ రోడ్ నెం.44(ఏ)లో నరేంద్రచారి మైరు బిస్ట్రో కాఫీ షాపును నడిపిస్తున్నాడు. ఆయనకు పక్షులంటే మహా ప్రాణం. ఆస్ట్రేలియా జాతికి చెందిన గాలా కాక్టో అనే చిలుకను అక్కడి నుంచే తెప్పించుకొని అపురూపంగా పెంచుకుంటున్నాడు. అయితే ఇటీవల ఈ చిలుక పంజరం నుంచి ఎగిరిపోయింది. దీంతో తన చిలుక కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసి దాని ఫొటోను కూడా అందించాడు. నాలుగు నెలల వయసున్న ఈ చిలుక ఖరీదు రూ.1.30 లక్షలుగా యజమాని తెలిపాడు. ఎక్సోటిక్ బర్డ్‌గా గుర్తింపు పొందిన ఈ చిలుకను తాను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నానని, దీనికి లైసెన్స్ కూడా ఉందని రెండు క్లాక్‌ ఆ దేశం నుంచి ఇక్కడికి తీసుకొచ్చేందుకు రెండు రింగులు కూడా ఉంటాయని వెల్లడించారు. ఎస్‌ఐ ఈ చిలుక ఫొటోలను జూబ్లీహిల్స్‌లోని పెట్‌షాప్స్‌కు పంపించారు. ఎవరైనా ఈ చిలుకను అమ్మితే వారి వివరాలు తెలపాల్సిందిగా సూచించారు. ఓ వ్యక్తి ఈ చిలుకను ఎలా పట్టుకున్నాడో తెలియదు కానీ మూడు రోజుల క్రితం ఎర్రగడ్డలో రూ.30 వేలకు ఓ పక్షి ప్రేమికుడికి విక్రయించాడు. అదే వ్యక్తి ఆ తెల్లవారి రూ.50 వేలకు సయ్యద్ ముజాహిద్‌కు అక్కడే విక్రయించాడు. ఈ చిలుకను కొనుగోలు చేసిన ముజాహిద్ తన వద్ద ఖరీదైన, అరుదైన గాలా కాక్టో ఆస్ట్రేలియన్ జాతి చిలుక ఉందని రూ.70 వేలకు విక్రయిస్తానంటూ వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నాడు. జూబ్లీహిల్స్‌లోని ఓ పెట్‌షాప్ నిర్వాహకుడు ఈ స్టేటస్ చూసి జూబ్లీహిల్స్ ఎస్‌ఐకి సమాచారం ఇచ్చాడు. ఫోన్ నెంబర్ ఆధారంగా సదరు వ్యక్తిని గుర్తించి స్టేషన్‌కు రప్పించడమే కాకుండా తన దగ్గర బందీగా ఉన్న చిలుకను యజమాని నరేంద్రాచారికి అప్పగించారు. దాదాపు ఇక దొరకదేమో అనుకున్న తన పెంపుడు చిలుక కనిపించేసరికి నరేంద్రాచారి ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. కష్టపడి చిలుకను పట్టుకొని అప్పగించినందుకు పోలీసులకు కతజ్ఞతలు తెలిపారు.



దళిత బంధు కింద సిల్ట్ కార్టింగ్ వాహనాల కీలను లబ్ధిదారులకు అందజేస్తున్న దృశ్యం

దళితుల అభ్యున్నతే లక్ష్యం

- దేశంలో ఎక్కడా లేని విధంగా 'దళిత బంధు' అమలు
- సిల్ట్ కార్టింగ్ వాహనాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్
- 162 వాహనాల అందజేత

సాక్షి, సిటీబ్యూరో/ఖైరతాబాద్: దేశంలో ఎక్కడ లేని విధంగా దళితుల అభ్యున్నతి కోసమే దళిత బంధు పథకం అమలు చేస్తున్నామని, స్వాతంత్య్రానంతరం దళితుల ఉద్ధరణకు పాటుపడిన ఒకే ఒక్క నాయకుడు సీఎం కేసీఆర్ అని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇది పరిపాలన దక్షత కలిగిన నాయకుల వల్లే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా హుస్సేన్ సాగర్ తీరంలోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మహాత్ముడు బాపూజీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు అనంతరం దళిత బంధు రెండో విడత కింద సిల్ట్ కార్టింగ్ వాహనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు వాటిని అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మహాత్ముడు చూపిన బాటలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. తర్వాత రాష్ట్రంలో ఎలాంటి ఘర్షణలు లేకుండా పరిపాలన సాగిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కొంతమంది ఢిల్లీలో కూర్చొని ఫొటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప ఆచరణలో ఏమీ చేయరని, స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దళితబంధు పథకం పెట్టలేదని విమర్శించారు. దళిత బంధు పథకం లబ్ధి చేకూరాల్సిన వారు ఇంకా లక్షల్లో ఉన్నారని, భవిష్యత్తులో అర్హులందరికీ పథకాన్ని వర్తింప చేస్తామని చెప్పారు. పలు దళిత కుటుంబాలకు లబ్ధి చేకూర్చడంతో పాటు నగర ప్రజలకు మరింత మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడానికి ఈ మురుగు వ్యర్థాల రవాణా (సిల్ట్ కార్టింగ్) వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

500 మందికి ప్రత్యక్ష ఉపాధి..

దళిత బంధులో భాగంగానే జలమండలి పరిధిలో పనిచేసేందుకు 162 మంది దళితులకు సిల్ట్ కార్ట్ వాహనాలను అందించామన్నారు. దీని వల్ల దాదాపు 500 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని తెలిపారు. ప్రతి వాహనానికీ వాటర్ బోర్డే పని కల్పిస్తుందని, డ్రైవర్, నిర్వహణ, సిబ్బంది ఖర్చులను సైతం జలమండలే చెల్లిస్తుందని వివరించారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే.. మానవ ప్రయత్నాలతో పాటు యంత్రాల సహాయ మూ అవసరమన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో వీటిని ఎప్పటి నుంచో ఉపయోగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎండీ దానకిశోర్ మాట్లాడుతూ జలమండలి కోసం సిల్ట్ కార్టింగ్ వాహనాలు కావాలని మంత్రి కేటీఆర్ వద్ద ప్రతిపాదించినప్పుడు.. వాటిని దళితబంధు పథకం కింద అందించాలని సూచించినట్లు తెలిపారు. ఇందుకు గానూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వాహనాలు అందుకున్న వారంతా విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేసి బోర్డుకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పురపాలక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, డిప్యూటీ మేయర్ శ్రీలత, కార్పొరేటర్లు, జలమండలి ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ఇతర డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్



కుట్టు మిషన్ల పంపిణీ

షాద్‌నగర్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ అన్నారు. కేసీఆర్ కా తోఫా ఖవాతీన్ కే లియే భరోసా పథకంలో భాగంగా సోమవారం పట్టణంలోని కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో 90 మంది మైనార్టీ మహిళలకు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీల ఆర్థిక పురోభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతున్నారని అన్నారు. పేద ముస్లిం మహిళలను అన్ని విధాలా ఆదుకునేందుకు ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రత్యేక పథకాన్ని చేపట్టిందని అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 20వేల మంది మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, నాయకులు కొందూటి నరేందర్, నట్‌రాజన్, వంకాయల నారాయణరెడ్డి, జమృద్‌ఖాన్, రామకృష్ణ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- దేశంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్రూం ఇళ్లు
- మంత్రి సబితారెడ్డి



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి సబితారెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు

మహేశ్వరం: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో డబుల్ బెడ్రూంలను నిర్మించి పేదలకు పంపిణీ చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను మూడో విడతలో భాగంగా సోమవారం డ్రా తీశారు. 2,099 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు, తాళాలను జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చాలి, ఆత్మ గౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ సకల సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్రూం ఇళ్లకు శ్రీకారం చుట్టారన్నారు. రాజకీయ పార్టీలు, కుల, మత బేధాలు లేకుండా గూడు లేని నిరుపేదలకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందన్నారు. అంతకు ముందు ఆన్‌లైన్‌లో డ్రా తీసి లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలతో పాటు తాళాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, రాజేంద్రనగర్, వికారాబాద్ ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, మెతుకు ఆనంద్, ఇబ్రహీంపట్నం ఎంపీపీ రాథ్లావత్ సునితా నాయక్, మన్సాన్‌పల్లి సర్పంచ్ కంది అరుణ, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ సౌత్ జోనల్ కమిషనర్ వెంకన్న, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు ఖరీదైన ఇళ్లు

- మంత్రి మహేందర్‌రెడ్డి



లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి: పేద ప్రజలకు ఖరీదైన ఇళ్లను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని సమాచార, పౌర సంబంధాలు, గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో రూ.130.79 కోట్లతో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని పేదలకు 1,512 డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించగా మొదటగా 50 మంది లబ్ధిదారులకు పట్టాలను అందించారు. మిగతా పట్టాలను జీహెచ్‌ఎంసీ హౌసింగ్ శాఖ అధికారులు ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేసి అందజేశారు. అంతకు ముందు మండలంలోని మహారాజ్‌పేట్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్లను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని తెలిపారు. దేశంలో ఎక్కడా ఇలాంటి ఇళ్లను అందించిన దాఖలాలు లేవన్నారు. శంకర్‌పల్లిలో ప్రస్తుతం ఎకరం రూ.10కోట్లు పలుకుతోందని గుర్తు చేశారు. పది ఎకరాల్లో సువిశాలంగా డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్, తహసీల్దార్ సురేందర్, కమిషనర్ జ్ఞానేశ్వర్, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం: గాంధీ చిత్రపటానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు


ఇబ్రహీంపట్నంలో..

బాపూజీ మా బాధలు ఆలకించండి

తమ డిమాండ్ల సాధన కోసం ఆశ, అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. రోజురోజుకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ.. వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చూస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బాపూజీ విగ్రహాలకు, చిత్రపటాలకు వినతిపత్రాలు అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం చెల్లించాలని, పెన్షన్, పీఎఫ్, ఈఎస్‌ఐ, గ్రాట్యుటీ అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతలతో పాటూ ఇతర పనులను అంగన్‌వాడీలతో ప్రభుత్వం చేయిస్తున్నది. ఆశ వర్కర్లు గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్య సేవలందిస్తున్నారు.


ఆమనగల్లులో..


తలకొండపల్లి: గాంధీ చిత్రపటానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు


తలకొండపల్లిలో..

తెలంగాణ నంబర్ వన్

- సంక్షేమానికి పెద్ద పీట
- మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి
- ప్రజలకు పారదర్శక పాలన
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య యాదవ్

షాద్‌నగర్: దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను చేపడుతున్నారని, అందువల్ల అభివృద్ధిలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద, రంగంపల్లి గ్రామాల్లో రూ.3.30కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నాయని తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రకటించారు. ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు ప్రభుత్వం నూతన పంచాయితీ రాజ్ చట్టాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత, జయలక్ష్మి, రాధాకృష్ణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో న్యూసిటీ కాలనీలో కౌన్సిలర్ కౌసల్య ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి అంజయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మన్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల మందు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మహేశ్వరం: నల్లమందు (ఓపీఎం) విక్రయిస్తున్న వ్యక్తిని మహేశ్వరం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన ప్రజాపతి (58) కాటేదాన్‌కు వలస వచ్చాడు. కొన్ని రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా జల్‌పల్లి శ్రీరాం కాలనీలో నల్లమందును విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై భాస్కర్ నేతృత్వంలో బృందం ఆదివారం రాత్రి ప్రజాపతిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 250 గ్రాముల నల్లమందు, రూ.2,480 నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి బలవన్మరణం


సురేశ్ (ఫైల్)

చేవెళ్ల: కడుపు నొప్పి భరించలేక ఓవ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలోని కమ్మెటలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కాశ సురేశ్(28), భార్య కవిత నార్సింగి మున్సిపాలిటీలో చెత్త సేకరణ కూలీలుగా పనిచేస్తున్నారు. కాగా అతడు కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం భార్యాపిల్లలతో కలిసి భోజనం చేసి పడుకున్నారు. తెల్లవారుజామున భార్య లేచి చూసే వరకు భర్త కనిపించలేదు. బయటకు వెళ్లి చూడగా పక్కనే ఉన్న గుడిసె పైకప్పుకు తాడుతో ఉరేసుకుని కనిపించాడు. ఆందోళన చెందిన ఆమె సురేశ్ తండ్రి పెంటయ్యకు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. సురేశ్ తండ్రి వచ్చే వరకే సురేశ్ మృతి చెందాడు. చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపులపై దాడులు

అక్రమ మద్యం స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఇబ్రహీంపట్నం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై పోలీసులు దాడులు చేశారు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ మైబెల్లి కథనం ప్రకారం.. పోచారం గ్రామంలో లింగమయ్య (52) కిరాణాషాపులో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అనుమతి లేకుండా నిల్వ చేసుకున్న 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా పొల్కంపల్లిలో నిర్మల (45) కిరాణషాపుపై దాడి చేసి 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నాగన్‌పల్లిలో సత్యనారాయణ (42) బెల్ట్ షాపుపై దాడిచేసి తొమ్మిది బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గాంధీ జయంతి రోజున గ్రామాల్లో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఈ దాడులు జరిపినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

న్యాయమూర్తుల శ్రమదానం


స్వచ్ఛభారత్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

ఇబ్రహీంపట్నం: గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛ భారత్‌లో భాగంగా సోమవారం ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు నాగరాజు, యశ్వంత్‌సింగ్, హిమబిందుతో పాటు న్యాయవాదులు శ్రమదానం చేశారు. కోర్టు ఆవరణలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించారు. స్వచ్ఛ భారత్ ఆవశ్యకతను తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌గౌడ్, న్యాయవాదులు మాదన్న, రవికిరణ్, సిహెచ్ రవి, వెంకటేశ్, ధనుంజయలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


నర్సింగ్‌రావు(ఫైల్)

మొయినాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామానికి చెందిన నర్సింగ్‌రావు(27) కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగించేవాడు. సెప్టెంబర్ 30న రాత్రి 10.30 గంటల సమయంలో బైక్‌పై చిలుకూరులోని మేనత్త వద్దకు వెళ్లాడు. అదే రాత్రి తిరుగు ప్రయాణంలో రెడ్డిపల్లి సమీపంలోని బాలాజీ గార్డెన్ వద్ద గుర్తుతెలియని వాహనం అతివేగంగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రం గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానిక భాస్కర ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మెగా హెల్త్ మేళా

షాద్‌నగర్: వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మంగళవారం మెగా హెల్త్ మేళా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆవరణలో నిర్వహించనున్న ఈ వైద్య శిబిరానికి నగరంలోని ఉస్మానియా ఆస్పత్రి నుంచి ప్రత్యేక బృందం రానున్నట్లు తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కార్డియాలజీ, డెర్మటాలజీ, మెడికల్ గ్యాస్ట్రో, న్యూరో, గైనిక్, పీడియాట్రిక్ వైద్య నిపుణులు, అప్తమాలజీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ వైద్యులు విచ్చేస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు ఉదయం 8గంటల నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

గంజాయి తరలిస్తున్న ముఠాకు రిమాండ్

- 80 కిలోల గంజాయి, కారు, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్
- వివరాలు వెల్లడించిన షాబాద్ సీఐ యాదయ్యగౌడ్

షాబాద్: గంజాయి తరలిస్తున్న ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోని తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి షాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. షాబాద్ సీఐ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని అల్లూరు సీతారామరాజు జిల్లా నుంచి షాద్‌నగర్, షాబాద్, చేవెళ్ల మీదుగా మహారాష్ట్రకు ఈ గ్యాంగ్ గంజాయి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో రాజేంద్రనగర్ ఎస్ఓటీ, షాబాద్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి సర్దార్‌నగర్ వద్ద ఈ ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 80 కిలోల గంజాయి(40 ప్యాకెట్లు) నాలుగు స్మార్ట్ ఫోన్స్, ఒక కారును సీజ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కుచెందిన అశోక్ తెనాలి, మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన అమోల్ రమేశ్, కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బాల్‌కీభీం నగర్ చెందిన సతీశ్ భోస్లే, హమ్నాబాద్ గట్టు ఓరక్‌కు చెందిన హరీశ్ జగ్తాప్, మహారాష్ట్ర ఆతూరు హౌసాకు చెందిన రజనీకాంత్ బాలాజీ పటోలేను నిందితులుగా గుర్తించి రిమాండ్‌కు తరలించామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE
■ Mallapur, Near Nacharam, Habsiguda 3BHK Premium Flats for Resale Gated Community Club House Ready to Occupy Brand New Call: 7702226063 [H-193207]

LAND FOR SALE
■ రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, పులిమామిడి గ్రామంలో 2 ఎకరాల భూమి అమ్మబడును. సంప్రదించండి: Ph: 6305386308 [HA-2205]

VILLA FOR SALE
■ Very, Afordable 2BHK Villas in Fully Developed Gated Community at Rampally, Near Ghatkesar Last Few Villas for sale Ph: 9490439711 [H-193206]

Services

BUSINESS SERVICE
■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-788377]

PERSONAL CARE

CHANGE OF NAME
■ I, Sajeeda Mehmood Bagdadi, W/o. Shajid Ahamed Mohammed, am changing my name to Sajeeda Shajid, W/o. Shajid Ahamed Mohammed, for all purpose. [HA-29346]

OLD AGE HOME
■ వృద్ధులకు, డిపెషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్, ECIL, Hyd సంప్ర: 9849520296, 7981467036. [H-169408]

Wanted
■ కూకట్‌పల్లి (KPHB) ఏరియాలో ప్రముఖ హాస్పిటల్ కొరకు హౌస్ కీపింగ్ లేడీస్ అర్జెంటుగా కావలెను. 8గం. డ్యూటీ 4 వీక్లీ ఆఫ్స్ ESI+PF+ జీతం. సంప్ర : 9000888154, 9032153413 [H-789605]
■ రిసెప్షనిస్ట్, టెలికాలర్స్, డాటాఎంట్రీ, టైపింగ్, వీడియో ఎడిటింగ్, న్యూస్ రీడింగ్, యాంకర్స్, హెల్పర్స్ (బోర్డ్) ఆయాలు, డ్రైవర్లు, Age 16-72 జీతం 10-18K, ఫ్రీ రూం, పీఎఫ్. ఫోన్ : 9505261777 [H-789323]
■ ప్రముఖ హోమ్‌కేర్ సర్వీసెస్ హైదరాబాద్ లో వృద్ధులకు,పేషెంట్లకు సేవచేయుటకు, బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు కా॥. జీ: 16,000-25000/-రూం+భో॥ఫ్రీ. ఫోన్: 9390343765 [H-793487]
■ అన్నపూర్ణ హోమ్‌కేర్ పెద్దవారికి సేవ చేయుటకు, పేషెంట్ కేర్, బేబీ కేర్, ఆయాలు, స్త్రీ/పురుషులు కావలెను. జీతం : 16000/- 30000/- రూమ్ + భోజన సౌకర్యం కలదు. ఫోన్ : 9880427694 [H-788831]
■ అర్జెంటుగా పంజాగుట్ట, హైటెక్ సిటీ పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం+రూం+భోజనం+ ESI+PF ఫోన్:8639110999, 9398915299 [H-788630]
■ రామకృష్ణ హోంకేర్ సర్వీసెస్ (AP NO-1) VJA, HYD శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవ లేక వంట/ఇంటి పని, బేబీ కేర్ వర్కర్స్ కావలెను భోజనం+వసతి+జీ :15-21 వేలు ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 86397 56217, 86397 56214
■ జాబ్ గ్యారెంటీ మహిళలకు మా కంపెనీలో ఉచిత రూం+భోజనం ఇచ్చి జాబ్ ఇవ్వబడును. జీతం: 20,000/- వరకు ఏజెంట్స్ (1 మనిషికి 5000/- కమీషన్) Ph: 7799087387 [H-793300]
■ Urgent Required For Security Guards Location Old City Hyd Q. 10th Pass 12Hrs, ESI+PF, Uniform & Food, Sal : 17,500/- Ph :9989187157 [H-793600]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
ఖార్కానా	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

కసిరెడ్డిని విమర్శించడం తగదు

గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్యానాయక్


సమావేశంలో మాట్లాడుతున్న హన్యానాయక్

కల్వకుర్తి: ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నాయకులకు లేదని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్యానాయక్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నారాయణరెడ్డి ఎమ్మెల్సీగా కల్వకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విజయానికి ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. నారాయణరెడ్డిపై లేని పోని విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కమ్లీమోత్యానాయక్, భాస్కర్‌రెడ్డి, బలరాంనాయక్, గోపీనాయక్, మల్లేశ్, ఆనంద్, ప్రభులింగం, దయాకర్‌రెడ్డి, నరేశ్, శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రేమ పేరుతో వంచన.. యువకుడికి రిమాండ్

శంకర్‌పల్లి: ప్రేమ పేరుతో వంచించిన యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శంకర్‌పల్లి ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీలో ఉంటున్న బాలికను ప్రేమిస్తున్నానని బీహార్ రాష్ట్రానికి చెందిన గౌతమ్‌కుమార్ అనే యువకుడు మాయమాటలు చెప్పి సెప్టెంబర్ 14వ తేదీన ఇంటి నుంచి తీసుకెళ్లాడు. బాలిక నుదిటిపై బొట్టు పెట్టి మనకు పెళ్లి జరిగిందని నమ్మించి లోబర్చుకున్నాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

జూకల్ స్టేషన్‌కు మొదటి గూడ్స్ రైలు రాక

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని జూకల్ శివారులో ఏర్పాటు చేసిన గూడ్స్ రైలు అల్టింగ్ స్టేషన్‌కు మొదటిసారి సోమవారం సిమెంట్ లోడ్‌తో గూడ్స్ రైలు చేరుకుంది. నాగపూర్ నుంచి ఏసీసీ సిమెంట్‌ను తీసుకురాగా.. రైలు నుంచి లారీల్లో సిమెంట్‌ను తరలిస్తున్నారు. ఉందానగర్-తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌ల మధ్య ఈ అల్టింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. గతంలో గూడ్స్ రైళ్లు తిమ్మాపూర్ వద్ద ఆగి సరుకులను చేరవేసేవి. కొత్తగా జూకల్ శివారులోని పిల్లోనిగూడ-పాల్మాకుల రైల్వే గేటు సమీపంలో ఈ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు.

అరసం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

సుల్తాన్‌బజార్: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలు సోమవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగాయి. ఈ సందర్భంగా అరసం నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఆర్వీ రామారావు, రాష్ట్ర అధ్యక్షులుగా పల్లేరు వీరస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాప్రోలు సుదర్శన్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కేపీఎల్ లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఆయాచితం శ్రీధర్‌లతో పాటు అరసం నేతలు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో అద్భుత ప్రదర్శన

- 'గాడియం' వేదికగా ఐఎస్ఎస్ఓ నేషనల్ గేమ్స్
- వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గాడియం స్కూల్ వేదికగా నిర్వహించిన ఐఎస్ఎస్ఓ (ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ స్కూల్ ఆర్గనైజేషన్) నేషనల్ గేమ్స్ ఆధ్వర్యంలోని ఆర్కోబాటిక్ జిమ్నాస్టిక్స్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. ఇందులో భాగంగా ఓపెన్‌తో పాటు అండర్-11, 14, 17, 19 తదితర విభాగాల్లో రిథమిక్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ పోటీలను నిర్వహించారు. బాలె, డాన్స్ సమ్మిళితంగా ప్రదర్శించే ఈ జిమ్నాస్టిక్స్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గాడియం వేదికగా బహుమతులను ప్రదానం చేశారు. ఓపెన్ కేటగిరీ ఉమెన్స్ ట్రయోలో ఉత్పల్ షాంగ్వీ, గ్లోబల్ స్కూల్ విద్యార్థులు కార్యన్ ఏంజెల్ ఫెర్నాండేజ్, తనిష్కా మోత్వాని, సిద్ధిషాలు, మిక్స్‌డ్ పెయిర్‌లో పొంటెయిన్ హెడ్ స్కూల్ విద్యార్థులు హర్షల్ తనిష్కా పటేల్, మిక్స్‌డ్ పెయిర్‌లో సంహిత శర్మ, హస్నా జైన్ విజేతలుగా నిలిచారు. వీరితో పాటు అండర్-11 విభాగంలో ది గాడియం స్కూల్ విద్యార్థి ఆర్యప్ రాడ్కో, అండర్-14లో హెట్ తుషార్ షాంగ్వీ, అండర్-17లో ఇసాక్ జార్జ్ జోయెల్, అండర్-19లో కై లా క్యాలిస్టా ఆల్బర్ట్ విజేతలుగా నిలిచారు. వీరితో పాటు వివిధ మెన్, ఉమెన్ విభాగాల్లోని విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.., అథ్లెటిక్స్, ఆర్టిస్ట్రీ నైపుణ్యాలతో రిబ్బన్లు, హూప్స్, క్లబ్స్ వంటి పరికరాలతో అద్భుత జిమ్నాస్టిక్ ప్రదర్శనకు గాడియం వేదికగా నిలిచిందన్నారు. గాడియం స్కూల్‌లో భారతీయ జిమ్నాస్టిక్స్ జాతీయ జట్టు కోచ్ మనోజ్‌రాజా శిక్షణ అద్భుత ఫలితాలను అందించిదని తెలిపారు.

ఆర్యవైశ్యులు సంఘటిత శక్తిగా మారాలి


మాట్లాడుతున్న చింతల నందకిశోర్ గుప్తా

శంషాబాద్: ఆర్యవైశ్యులు సంఘటిత శక్తిగా మారాలని వక్తలు పేర్కొన్నారు. ఆర్యవైశ్య మండల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సోమవారం వెంకటేశ్వర ఆలయంలో జరిగింది. ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధికారత సాధించే దిశగా ముందుకెళ్లాల్సిన అవసరముందని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు ఆర్. గణేష్‌గుప్తా సూచించారు. ప్రమాణ స్వీకారంలో శంషాబాద్ మండల అధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి శేఖర్ గుప్తా, కోశాధికారి సర్వేశ్వర్ గుప్తా, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, మధుమోహన్ గుప్తా, రమేష్, సుబ్బారాజు, రఘు, మహిళా విభాగం అధ్యక్షులు ఇంద్రాణి గుప్తా, ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, కోశాధికారి మాణిక్ అరుణ, కార్యవర్గ సభ్యులు సురేష్, విజయ్‌రావు, మహేందర్, వేణు, విశ్వనాథం, రజనికాంత్ గుప్తా పాల్గొన్నారు.

అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నమెంట్‌కు ప్రణాళిక


మాట్లాడుతున్న హెచ్‌జీఏ అధ్యక్షుడు జయంత్ ఠాగూర్

గోల్కొండ: హైదరాబాద్ లో అంతర్జాతీయ స్థాయి గోల్ఫ్ టోర్నమెంట్‌లను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అధ్యక్షులు జయంత్‌ఠాగూర్ అన్నారు. గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ టోర్నమెంట్ విజయవంతమైన సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ గోల్కొండ మాస్టర్స్ దేశంలోని గోల్ఫ్ టోర్నమెంట్‌లలో అత్యంత ప్రముఖమైనదని ఈ టోర్నమెంట్‌లో విదేశాల గోల్ఫర్లు కూడా పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈసారి గోల్కొండ మాస్టర్స్‌కు బొల్లినేని పనాచే స్పాన్సర్‌గా ఉన్నారని తెలంగాణ టూరిజం శాఖ సహకారంతో ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేశామన్నారు. గోల్కొండ మాస్టర్స్ ఛాంపియన్‌గా అమన్‌రాజ్ నిల్చా రాటారన్నారు. టాటా స్టీల్ టీజీటీఐ ర్యాంకింగ్‌లో ఈసారి గోల్కొండ మాస్టర్స్ విజేత అమన్‌రాజ్ తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకున్నారన్నారు. మొదటి బహుమతి విజేతకు రూ.15 లక్షలు అందజేసినట్లు తెలిపారు.